క్లుప్తంగా

ఘనంగా షిర్డీ సాయినాథ్‌ ఆలయ వార్షికోత్సవం



పెంట్లవెల్లి: మండల కేంద్రంలో షిర్డీ సాయి దేవాలయ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. సుప్రభాతసేవతో పాటు ఉదయం 7:00 గంటలకు గణపతిపూజ, 7.30 గంటలకు సాయినాథుడిని క్షీరాభిషేకం, 10.30 గంటలకు సత్యనారాయణ వ్రతం, 12.30 గంటలకు మహామంగళహారతి తదితర కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. అధికసంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకున్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీలు



తాడూరు: మండలంలోని మేడిపూర్‌లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ వద్ద గురువారం ఎస్‌ఐ మహేష్‌ ఆధ్వర్యంలో రెండు రోజుల నుంచి వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ప్రతి వాహనాన్ని తనిఖీ చేసి వాహనాలను నంబర్లను రిజిస్టర్‌లో నమోదు చేస్తున్నారు. వాహనదారులు పోలీసులకు సహకరించాలని కోరారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

వెల్దండ: మండలంలోని ఈదమ్మబండతండాలో నేనావత్‌ హుమ్లి అనారోగ్యంతో మృతి చెందింది. గురువారం మాజీ ఎంపీపీ జయప్రకాష్‌ మృతురాలి భర్త మోత్యానాయక్‌ను పరామర్శించి మనోధైర్యం నింపారు. అనంతరం రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. రాజవర్ధన్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌ లాలునాయక్‌, ఆంజనేయులు, వెంకటేష్‌ తదితరులు ఉన్నారు.

అంబులెన్సులో చెంచు మహిళ ప్రసవం

లింగాల: మండలంలోని అప్పాయపల్లికి చెందిన చెంచు మహిళ కాట్రాజు మానస అంబులెన్సులో గురువారం ప్రసవించింది. అంబులెన్స్‌ సిబ్బంది వివరాల ప్రకారం మహిళకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. కాన్పు కోసం అచ్చంపేటకు తరలిస్తుండగా మార్గం మధ్యలో నొప్పులు అధికం కావడంతో అంబులెన్స్‌లోనే మహిళ పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లి బిడ్డలు క్షేమంగా ఉన్నారని మెరుగైన వైద్యం కోసం అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లినట్లు సిబ్బంది లక్ష్మణ్‌, ఖాజా తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృత్యువాత

అచ్చంపేట రూరల్‌: పట్టణంలోని గోకుల్‌నగర్‌లో విద్యుదాఘాతానికి ఓ గేదె మృతిచెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రైతు శివ పశువులను ఇంటికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో ఓ గేదె విద్యుత్‌ స్తంభానికి తగిలి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఏఈ ఆంజనేయులు ఘటన స్థలాన్ని పరిశీలించారు.

పెద్దకొత్తపల్లి: మండలంలోని మరికల్‌లో ఇటీవల వీచిన ఈదురుగాలులకు విద్యుత్‌ తీగలు తెగి కిందపడ్డాయి. దీంతో గ్రామానికి చెందిన బీరం యాదమ్మకు సంబంధించిన గేదె వ్యవసాయ పొలం వద్ద మేత మేస్తుండగా గురువారం ప్రమాదవశాత్తు విద్యుత్‌ తీగలకు తగిలి అక్కడికక్కడే మృతిచెందింది.

మత రాజకీయాలతో బీసీలకు అన్యాయం



నాగర్‌కర్నూల్‌రూరల్‌: బీజేపీ ప్రభుత్వం మత రాజకీయాలు చేస్తూ, బీసీలకు తీవ్ర అన్యాయం చేస్తోందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కాళ్ల నిరంజన్‌, వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కుంభం మల్లేష్‌గౌడ్‌ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీజేపీ.. బీసీలకు విద్యాపరంగా, రాజకీయంగా రిజర్వేషన్ల అమలులో ఏనాడూ సముచిత న్యాయం చేయలేదన్నారు. బడ్జెట్‌లో నిధుల కేటాయింపులో సైతం వివక్ష చూపిందన్నారు. బీసీల స్థితిగతులపైన అధ్యాయనం చేయకుండా మోసం చేశారని ఆవేదన వ్యక్తంచేశారు. బీసీల ఓట్లు అడిగే నైతిక హక్కును బీజేపీ, బీఆర్‌ఎస్‌లు కోల్పోయాయని అన్నారు. రాహుల్‌గాంధీ ప్రధాని అయితే కులగణన జరిగి, బీసీలకు సామాజిక న్యాయం చేకూరుతుందన్నారు. సమావేశంలో కొత్త శ్రీనివాసులు, తిరుపతయ్య, సుధాకర్‌గౌడ్‌, పబ్బతి శ్రీనివాసులు, కుమ్మెర చెన్నయ్య, కృష్ణయ్య, నిరంజన్‌ యాదవ్‌, చైతన్య, కురుమయ్య ఉన్నారు.

భూసార పరీక్ష జాడేది?

- నాలుగేళ్లుగా పరీక్షలు లేవు
- నష్టపోతున్న రైతులు



లింగాల మండలంలో భూసార పరీక్షల కోసం మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయాధికారి(ఫైల్‌)

అచ్చంపేట రూరల్‌: పంటలు అధిక దిగుబడి సాధించేందుకు భూసార పరీక్షలు తప్పనిసరి. అప్పుడే భూమికి తగిన పంట సాగుచేసుకునేందుకు అవకాశం ఉంటుంది. మట్టిలో పోషక విలువలు కూడా తెలుస్తాయి. ఇప్పటికి రైతులకు పొలాల్లో ఏ పోషక విలువలు ఎంత మోతాదులో ఉన్నాయో..? వారికి తెలియడం లేదు. దీంతో ఇష్టానుసారంగా పంటలను సాగు చేసి నష్టపోతున్నారు. భూసార పరీక్షలు చేసుకుంటే పంట భూముల్లో పోషక విలువలు బట్టి పంట వేసుకొని దిగుబడి సాధించవచ్చు. కానీ నాలుగేళ్లుగా భూసార పరీక్షలు లేక రైతులు పంట దిగుబడి సాధించలేక నష్ట పోతున్నారు. భూమి సారవంతంపై అవగాహన లేక రైతులు ఎరువులు విచ్చలవిడిగా వాడుతున్నారు. పెట్టుబడి వ్యయం పెరిగి, పోషకాలు తగిన రీతిలో అందక భూమి నిస్సారమైపోతుంది. భూసార పరీక్షలు చేయడానికి ఏప్రిల్‌, మే నెల అనుకూలం. ఇప్పటి వరకు ఎక్కడా భూసార పరీక్షలు చేసిన దాఖలాలు కన్పించడం లేదు.

నాలుగేళ్లుగా జాడలేని పరీక్షలు...

వ్యవసాయాధికారులు తమ పరిధిలో మట్టి నమూనాలు సేకరించి జడ్చర్ల, రాజేంద్రనగర్‌ ప్రయోగశాలకు పంపించేవారు. వచ్చిన ఫలితాలలో సారాన్ని బట్టి రైతులు ఏ పంట వేసుకోవాలో, ఎంత మోతాదులో ఎరువులు వాడాలో వ్యవసాయాధికారులు సూచించేవారు. ఈ ప్రక్రియ 2020 వరకు కొనసాగింది. అప్పటి నుండి ఇప్పటి వరకు భూసార పరీక్షలు జరగలేదు. ఎవరైనా రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలంటే పొలెం వద్దకు నేరుగా వెళ్లి చేయించుకోవచ్చని అధికారులు సూచిస్తున్నప్పటికీ రైతులు ఎవరూ మొగ్గు చూపడం లేదు. గతంలోనూ పరీక్షల ఫలితాలు ఆలస్యంగా రావడం, కొందరు అధికారులు నిర్లక్ష్యంగా ఉండటం వల్ల రైతులు పెద్దగా ఆసక్తి చూపలేదు. కొన్ని క్లస్టర్లలో మిషన్లు పంపిణీ చేసినా రసాయనాల సరఫరా లేకపోవడంతో మిషన్లు మూలన పడ్డాయి.

భూసార పరీక్షలతో లాభం

గ్రామాల్లో రైతుల పంట పొలాల్లో మట్టి నమూనాలను సేకరించి భూసార పరీక్షలు నిర్వహిస్తారు. నేల స్వభావం తెలియడంతో తక్కువగా ఉన్న పోషకాలను గుర్తించి వాటిని అందించడం ద్వారా ఫలితాన్ని పొందే అవకాశం ఉంది. పంటల సాగులో అధిక దిగుబడులు సాధించాలంటే భూసార పరీక్షలకు ఎంతో ప్రాధాన్యత ఉంటుంది. పరీక్షల ఫలితాల ద్వారా పంట పొలాల్లో ఏ పంటలను సాగు చేసుకోవాలి, ఏ ఎరువులను ఎంత మోతాదులో వాడాలని అధికారులు స్పష్టంగా చెబుతారు.

పోషకాలు ఉంటేనే మొక్కల ఎదుగుదల

రైతులు తమ పొలంలో నత్రజని, భాస్వరం, పొటాష్‌ వంటి ఎరువులు వేయడానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. వాటిని అధికంగా వాడటం వల్ల భూమిలో క్రమంగా సమతుల్యత లోపిస్తుంది. పోషకాలు ఉంటేనే మొక్కల ఎదుగుదలకు అనువుగా ఉంటుంది. ఇందులో జింక్‌, ఐరన్‌, నైట్రోజన్‌, కాల్షియం, కాపర్‌, సల్ఫర్‌, బోరాన్‌, కార్బన్‌, హైడ్రోజన్‌, ఆక్సిజన్‌ వంటివి ఎంతో అవసరం. ఇవన్నీ నేలలో సమానంగా ఉండవు. వీటి నిర్ధారణకు భూసార పరీక్షలు ఎంతో అవసరం. గతంలో ప్రభుత్వం ప్రతి ఏడాది నీటి లభ్యత ఉన్న ప్రాంతాల్లో పది ఎకరాలకు ఒక మట్టి నమూనా, వర్షాధారిత ప్రాంతాల్లో 25 ఎకరాలకు ఒక మట్టి నమూనా సేకరించి పరీక్షించే వారు.

భూముల వివరాలు

అచ్చంపేట మండల వ్యాప్తంగా 1,47,656 ఎకరాల భూమి ఉంది. అందులో 84,040 ఎకరాలు అటవిశాఖ పరిధిలో ఉంది. యాసంగిలో వేరుశనగ, వరి పంటలను సుమారు 17 వేల ఎకరాలు, వానాకాలంలో పత్తితో పాటు వరి 42 వేల ఎకరాల వరకు సాగు చేస్తారు. మండలంలో 18,500 మంది రైతులు ఉన్నారు. ఎర్రనేలలు(దుబ్బచెలక)లో పత్తి, వరి, వేరుశనగ పంటలను అధికంగా సాగు చేస్తున్నారు.

పరీక్షలు చేయాలి



గతంలో మాదిరిగా రైతుల పొలాల్లో భూసార పరీక్షలు చేయాలి. భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పించాలి. రైతులు నష్టపోకుండా చూడాలి. స్థానికంగా ఉన్న రైతు వేదికల వద్దనే భూసార పరీక్షల ఫలితాలు వెల్లడిస్తే రైతుకు అనుకూలంగా ఉంటుంది. – వెల్టూరి యాదయ్య, కాంసానిపల్లి, ఉప్పునుంతల

నిధులు కేటాయించాలి



భూసార పరీక్షల కోసం పొలెం వద్దకు వెళ్లి పరీక్షలు చేసుకోవాలని వ్యవసాయాధికారులు చెప్తున్నారు. పంటల సాగు పనులతో వెళ్లలేకపోతున్నాం. అధికారులు భూసార పరీక్షల కోసం నమూనాలు సేకరించాలి. దూర ప్రాంతానికి వెళ్లి పరీక్షలు చేయించుకోలేం. – వెంకటస్వామి, అంబటిపల్లి, లింగాల

నిర్వహణకు నిధులు లేవు



భూసార పరీక్షల నిర్వహణకు నిధులు మంజూరు కావడం లేదు. ఉమ్మడి జిల్లాలో జడ్చర్ల, జిల్లాలో పాలెంలో భూసార పరీక్షలు చేస్తున్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. రైతులే స్వయంగా కేంద్రాల వద్దకు మట్టి నమూనాలు తీసుకెళ్లాలి. – కృష్ణయ్య, వ్యవసాయాధికారి, అచ్చంపేట

ప్రకృతిలో ప్రతి మొక్క విలువైనదే..



రైతులకు అవగాహన కల్పిస్తున్న సునీత

బిజినేపల్లి: ప్రకృతిలో ప్రతి మొక్క విలువైనదేనని సమగ్ర సస్యరక్షణ కేంద్రం అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ ఆఫ్‌ పెస్ట్‌ మేనేజ్‌మెంట్‌ అధికారి ఆర్‌.సునీత అన్నారు. మండలంలోని ఖానాపూర్‌లో గురువారం అంతర్జాతీయ మొక్కల ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామస్తులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం రైతువేదికలో ప్రకృతి పరిరక్షణపై అవగాహన కల్పించారు. జీవవైవిధ్య సంరక్షణలో భాగంగా ప్రకృతిలో ప్రతి జాతి మొక్క, చెట్టు ఎంతో విలువైనదని తెలిపారు. రైతులు, పశుపక్షాదులకు మొక్కలు ప్రత్యక్షంగా, పరోక్షంగా మేలు చేకూరుస్తాయని వివరించారు. ప్రతి ఒక్కరూ ప్రకృతిని కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త డా.రాజశేఖర్‌, సస్యరక్షణ కేంద్రం సహాయ అధికారులు రవిశంకర్‌, సుధ, ఏఈఓ శారద పాల్గొన్నారు.

హరితహారానికి సిద్ధం కావాలి



నర్సరీల వివరాలను తెలుసుకుంటున్న జంగయ్య

వెల్దండ: మండలంలోని అన్ని గ్రామాల్లో హరితహారానికి సిద్ధం కావాలని జిల్లా అంబుడ్స్‌ పర్సన్‌ జంగయ్య ఆదేశించారు. గురువారం మండల కేంద్రంతోపాటు, తుంకిబండ తండా నర్సరీలను పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. నర్సరీలలో మస్టర్‌ రోల్‌కాల్‌, రెగ్యులర్‌ పేమెంట్స్‌పై నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఫీల్డ్‌ అసిస్టెంట్లు, నర్సరీల నిర్వాహకులు ఉన్నారు.

నల్లమలలో గాలివాన బీభత్సం



అమ్రాబాద్‌లో వర్షపునీటితో పారుతున్న వాగు



పద్మారాంతండాలో కొట్టుకుపోయిన ఇంటి పైకప్పు రేకులు

అచ్చంపేట రూరల్‌/అమ్రాబాద్‌: నల్లమలలోని పలు ప్రాంతాల్లో గురువారం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు నీటితో పారాయి. అచ్చంపేట మండలంలోని పద్మారాంతండాలో ఈదురు గాలులకు ఇంటి పైకప్పు రేకులు కొట్టుకుపోయాయి. తండాకు చెందిన కొర్ర శంకర్‌, నేనావత్‌ చందుతో పాటు మరి కొందరి ఇంటి పైకప్పు రేకులు ధ్వంసం కావడంతో రూ. 2 లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లింది. కాగా, వర్షం రాకతో వానాకాలం సాగుకు పొలాలను చదును చేసుకోవచ్చని రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

ఘన సన్మానం



సన్మానిస్తున్న నాయకులు

లింగాల: కాంగ్రెస్‌ పార్టీ గ్యారంటీ పత్రాలు గడపగడపకు చేర్చడంలో నాగర్‌కర్నూల్‌ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం యువజన కాంగ్రెస్‌ అధ్యక్షుడు డాక్టర్‌ శ్రీనివాస్‌రాథోడ్‌ జాతీయస్థాయిలో మొదటి స్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో గురువారం శ్రీనివాస్‌రాథోడ్‌ను మహిళా మండల అధ్యక్షురాలు ఇందిరమ్మ, పాండు దంపతులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటయ్య, బాలాజీ, రాజలయ్య, శ్రీనివాసులు, బారీ, శ్రీశైలం, తరుణ్‌, వెంకటరమణ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పాం తోటలతో లాభాలు



మాట్లాడుతున్న ఉద్యానవన శాఖ అధికారి లక్ష్మణ్‌

లింగాల: ఆయిల్‌పాం తోటలతో లాభాలు ఆర్జించవచ్చని ఉద్యాన వన శాఖ అధికారి లక్ష్మణ్‌ అన్నారు. గురువారం మండలంలోని అంబట్‌పల్లి రైతు వేదికలో ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అచ్చంపేట డివిజన్‌, ప్రీ యూనిక్‌ ఇండియా ప్రైవేటు లిమిటెడ్‌ ఆధ్వర్యంలో ఆయిల్‌పాం సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం లక్ష్మణ్‌ మాట్లాడుతూ మూడు సంవత్సరాలు పై బడిన చెట్లకు వర్షాకాలంలో 100–150 లీటర్ల నీటిని, శీతాకాలంలో 160–170 లీటర్ల నీటిని, వేసవిలో 215–265 లీటర్ల నీటిని ప్రతి రోజు అందించాలని సూచించారు. ఎండాకాలంలో వడగాల్పులు ఉంటే ప్రతిరోజు 300–350 లీటర్ల నీరు అవసరమని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి నాగార్జునరెడ్డి, ఆయిల్‌ పాం ఏరియా మేనేజర్‌ రాకేష్‌, ఏఈఓ శివానంద, క్లస్టర్‌ అధికారి దేవేందర్‌, రైతులు పాల్గొన్నారు.

ఊపందుకున్న ప్రచారం

పెంట్లవెల్లి: మండలంలోని మంచాలకట్ట, మల్లేశ్వరం, జటప్రోల్‌, పెంట్లవెల్లి గ్రామాల్లో కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌, బీజేపీ పార్టీల నాయకులు గురువారం విస్తృతంగా ప్రచారం చేశారు. ఆయా పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. పథకాలను వివరిస్తూ ముందుకుసాగారు.

ప్రమాదకరంగా విద్యుత్‌ స్తంభాలు



రోడ్డుపై ఇరువైపులా ప్రమాదభరితంగా విద్యుత్‌ స్తంభాలు

ఉప్పునుంతల : మండలంలోని తాడూరు– ఉప్పునుంతల రోడ్డు మార్గంలో విద్యుత్‌ స్తంభాలు ప్రమాదభరితంగా దర్శనమిస్తున్నాయి. దీంతో వాహనదారులు, ప్రయాణికులు భయాందోనకు గురవుతున్నారు. తాడూరు శివారులో ఏర్పాటు చేసిన విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ వరకు రెండు విద్యుత్‌ లైన్ల కోసం సంబంధిత కాంట్రాక్టర్‌ తాడూరు నుంచి దాదాపుగా కిలోమీటరు దూరం బీటీ రోడ్డుకు రెండు వైపుల స్తంభాలను ఏర్పాటు చేశారు. దీంతో ఎదురెదురు వాహనాలు వెళ్లలేని దుస్థితి నెలకొంది. రాత్రివేళ రోడ్డుపై ఉన్న స్తంభాలతో ఏ ప్రమాదం చోటుచేసుకుంటుందోనని బిక్కుబిక్కు మంటూ ప్రయాణిస్తున్నారు. అధికారులకు తెలిసినా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు విని పిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రోడ్డుపై పాతిన స్తంభాలను తొలగించి రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

‘వడ్డీలేని రుణాలు అందిస్తాం’



ఎమ్మెల్యే డాక్టర్‌ వంశీకృష్ణ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న అమ్రాబాద్‌ చిట్లంకుంట గ్రామస్తులు



పెద్దముద్దునూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి

సాక్షి, నెట్‌వర్క్‌: మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు అందిస్తామని ఎమ్మెల్యే డాక్టర్‌ వంశీకృష్ణ అన్నారు. పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం మండల కేంద్రంలోని వైపీ ఫంక్షన్‌ హాల్‌లో నిర్వహించిన మహిళా సదస్సుకు ఆయన హాజరై మాట్లాడుతూ కాంగ్రెస్‌ ఎంపీ అభ్యర్థి డాక్టర్‌ మల్లురవిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అచ్చంపేటలో ఓ ఫంక్షన్‌ హాలులో ఏర్పాటు సీపీఎం, కాంగ్రెస్‌ ముఖ్య నాయకుల సమావేశానికి సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దేశ్యానాయక్‌తో పాటు ఎమ్మెల్యే హాజరయ్యారు. బీజేపీ బందిఖానా నుంచి దేశాన్ని విముక్తి చేద్దాం అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. పదర మండలం చిట్లంకుంటలో ఎమ్మెల్యే మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. 100 మంది బీఆర్‌ఎస్‌ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. నాగర్‌కర్నూల్‌ మండలంలోని పెద్దముద్దునూర్‌లో నాగర్‌కర్నూల్‌ ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి మల్లురవికి మద్దతుగా ఇంటింటి ప్రచారం చేశారు. బిజినేపల్లి మండలం వసంతాపూర్‌లో ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి హస్తం గుర్తుకు ఓటు వేయాలని ఉపాధి కూలీలను కోరారు. నాగర్‌కర్నూల్‌ మండలం మల్కాపూర్‌లో ఇంటింటి ప్రచారంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు కందికొండ గీత హాజరై మాట్లాడారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌ అభ్యర్థులను ఓడించాలన్నారు. కోడేరు మండల కేంద్రంతో పాటు జనుంపల్లి, తీగలపల్లి, నర్సాయిపల్లి తదితర గ్రామాల్లో కాంగ్రెస్‌ శ్రేణులు ప్రచారం చేపట్టారు. కల్వకుర్తి మండలం వెంకటాపూర్‌లో యువజన కాంగ్రెస్‌ నియోజకవర్గ అధ్యక్షుడు అనీల్‌గౌడ్‌ మల్లురవిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. అదేవిధంగా కల్వకుర్తి మండలంలోని లింగసానిపలి, పంజుగుల్ల గ్రామాల్లో బ్లాక్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి కరపత్రాలను పంపిణీ చేశారు. పెద్దకొత్తపల్లి మండలం పెద్దకార్పాములలో నాయకులు ఇంటింటికి కరపత్రాలను అందజేశారు. మన్ననూర్‌లో సీనియర్‌ ఎస్‌ఎఫ్‌ఐ నాయకుడు ఎండీ సయ్యద్‌ బాబా కాంగ్రెస్‌లో చేరారు. లింగాల మండల కేంద్రంలో అచ్చంపేట నియోజకవర్గం యువజన కాంగ్రెస్‌ అధ్యక్షుడు డాక్టర్‌ శ్రీనివాస్‌రాథోడ్‌ ఇంటింటి ప్రచారంలో పాల్గొని మల్లురవికి మద్దతు ఇవ్వాలని కోరా రు. జెడ్పీటీసీ సభ్యులు కేవీఎన్‌రెడ్డి, ఎంపీపీ భీమ మ్మ, మల్లురవి కుమారుడు సిద్దార్థ్‌, మండల అధ్యక్షులు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ ప్రచారం

తెలకపల్లి మండలకేంద్రంలో టీపీసీసీ డాక్టర్స్‌ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా మాణిక్యాల చెన్నయ్య, జెడ్పీటీసీ సభ్యురాలు సుమిత్ర ప్రచారం చేశారు. కొల్లాపూర్‌ మున్సిపాలిటీ పరిధిలోని ఐదో వార్డులో మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ బేగం, ఖాదర్‌ పాషా ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తిమ్మాజీపేట మండలంలోని మారేపల్లిలో ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి ఇంటింటి ప్రచారంలో భాగంలో మల్లురవిని ఆశీర్వదించాలని కోరారు.

ఆరు గ్యారంటీలో ఐదు అమలు చేశాం



మాట్లాడుతున్న తెలంగాణ గౌడ కల్లు గీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్‌ బాల్‌రాజు గౌడ్‌

అచ్చంపేట రూరల్‌: కాంగ్రెస్‌ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే ఐదు గ్యారంటీలను అమలు చేశామని అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం హామీల అమలులో విఫలం అయ్యిందన్నారు. ఆగస్టు 15లోగా రూ.2లక్షల రుణమాఫీ చేస్తామన్నారు.

కాంగ్రెస్‌తోనే గౌడ కులస్తుల సంక్షేమం

నాగర్‌కర్నూల్‌ క్రైం: జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్‌ బాల్‌రాజు గౌడ్‌ మాట్లాడారు. గౌడ కులస్తుల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమని అందరు మల్లు రవికి మద్దతు ఇవ్వాలని కోరారు.

కాంగ్రెస్‌కు సంపూర్ణ మద్దతు

నాగర్‌కర్నూల్‌: జిల్లా కేంద్రంలోని సింగిల్‌ విండో కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆదివాసీలు, చెంచులు, గిరిజనుల అభివృద్ధి కోసం మూడు ప్రత్యేక ఆర్థిక కార్పొరేషన్లు ఏర్పాటు చేసిన కాంగ్రెస్‌ పార్టీకే సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు నేషనల్‌ ట్రైబల్‌ ఫెడరేషన్‌ రాష్ట్ర అధ్యక్షుడు ఉషా కిరణ్‌ స్పష్టం చేశారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌లను ఓడించాలని కోరారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మోహన్‌గౌడ్‌, నాగర్‌కర్నూల్‌ జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు మల్లయ్య గౌడ్‌, విజయ్‌కుమార్‌, పకీరయ్య గౌడ్‌, పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలు మానుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ పార్లమెంట్‌ అభ్యర్థి భరత్‌ప్రసాద్‌

నాగర్‌కర్నూల్‌: ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ పార్టీ గెలవలేకే బీజేపీపై అసత్య ప్రచారాలు చేస్తోందని నాగర్‌కర్నూల్‌ ఎంపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ ప్రసాద్‌ అన్నారు. గురువారం నెల్లికొండ మార్కెట్‌ యార్డ్‌ ఎదుట బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రిజర్వేషన్లపై ఫేక్‌ వీడియోలు సృష్టించి ఓటర్ల దృష్టిని మరల్చేందుకు కాంగ్రెస్‌ కుట్ర చేస్తోందని ఆరోపించారు. పది సంవత్సరాలుగా రిజర్వేషన్లు, రాజ్యాంగాన్ని కాపాడిన ఘనత బీజేపీకే దక్కుతుందన్నారు. తప్పుడు ప్రచారాలతో ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు కాంగ్రెస్‌ నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. బీజేపీకి 400 సీట్లు వస్తే ప్రపంచంలో భారతదేశం శక్తివంతమైన దేశంగా అవతరిస్తుందని అన్నారు. నాగర్‌కర్నూల్‌ ఎంపీగా గెలిపిస్తే పెండింగ్‌లో ఉన్న గద్వాల–మాచర్ల రైల్వేలైన్‌ కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు. బీజేపీ పార్లమెంట్‌ అభ్యర్థి ఎలక్షన్‌ ఏజెంట్‌ జక్కా రఘునందన్‌రెడ్డి, నాయకులు కట్టా సుధాకర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, జెట్టి వెంకటేష్‌ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, కాంగ్రెస్‌ హామీలు నమ్మొద్దు



లట్టుపల్లిలో కూలీ పనులు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి



కొల్లాపూర్‌ మండలంలో ఎన్మన్‌బెట్లలో..

బిజినేపల్లి: బీజేపీ, కాంగ్రెస్‌ హామీలు నమ్మొద్దని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని లట్టుపల్లి, గంగారం గ్రామాల పరిధిలోని పలు గిరిజన తండాల్లో బీఆర్‌ఎస్‌ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్‌ ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా ఆయన ప్రచారం నిర్వహించారు. ఉపాధి కూలీలను కలిసి కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొల్లాపూర్‌: పట్టణంలోని పలు వార్డుల్లో, ఎన్మన్‌బెట్లలో బీఆర్‌ఎస్‌ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ మాలె రజిత భాస్కర్‌గౌడ్‌, సీనియర్‌ నాయకులు అలంపూర్‌ సురేందర్‌రావులు ఆర్‌ఎస్‌. ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

పెద్దకొత్తపల్లి: మండలంలోని సాతాపూర్‌లో బీఆర్‌ఎస్‌ నాయకులు కుచ్చుల పరమేష్‌, వంశీగౌడ్‌లు ప్రచారం నిర్వహించారు.

కొల్లాపూర్‌ రూరల్‌: మండలంలోని అంకిరావుపల్లి, అమరగిరి, ఎల్లూరు, తదితర గ్రామాల్లో ఆర్‌ఎస్పీకి మద్దతుగా ప్రచారం చేస్తూ గతంలో బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను వివరించారు. నాగులపల్లి లక్ష్మయ్య, నిరంజన్‌, బంకల కురుమూర్తి, రామచంద్రం, విజయ్‌ పాల్గొన్నారు.

ఊర్కొండ: మండలంలోని మాదారం, ఊర్కొండపేట గ్రామాల్లో మాజీ మంత్రి లక్ష్మారెడ్డి, నాగర్‌కర్నూల్‌ జిల్లా పరిషత్‌ చైర్మన్‌ శాంత కుమారితో కలిసి రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ హామీల అమలులో సీఎం రేవంత్‌రెడ్డి విఫలం అయ్యారని ఆరోపించారు. మహబూబ్‌ నగర్‌ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించాలని ఓటర్లను కోరారు. మండల అధ్యక్షుడు వీరారెడ్డి, కదిరి శేఖర్‌, దుబ్బ రవి నాయకులు పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశ భద్రత, ప్రజా సంక్షేమం

కోడేరు: బీజేపీతోనే దేశ భద్రత, సంక్షేమం సాధ్యమని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రావు, లింగంగౌడ్‌, మండల అధ్యక్షుడు పుల్లయ్యలు అన్నారు. మండల కేంద్రంలో ఎంపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్‌ను గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బాలపీరు, రామకృష్ణ, నజీర్‌, నాగరాజు, మౌలాలి, లింగస్వామి పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి: మండలంలోని పెద్దకార్పాములలో ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు జలాల్‌ శివుడు ప్రచారం నిర్వహించారు. బీజేపీతోనే అవినీతి రహిత పాలన సాధ్యమన్నారు. కార్యక్రమంలో బీమేష్‌, శివ, శీను, కృష్ణ, రాజు, మహేష్‌, శంకర్‌, ఆంజనేయులు పాల్గొన్నారు.

కొల్లాపూర్‌ రూరల్‌: మండలంలోని రామాపురం, అంకిరావుపల్లి గ్రామాల్లో బీజేపీ నాయకులు ప్రచారంలో భాగంగా ఉపాధి కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సాయికృష్ణ గౌడ్‌ నాయకులు పాల్గొన్నారు.